క్లుప్తంగా

వైవీయూలో ముమ్మరంగా సుందరీకరణ పనులు



వైవీయూలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం రహదారి వెంబడి సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసిన సర్కిల్ వద్ద తారు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

25న డిగ్రీ సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన సదస్సు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 25న డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో మేజర్ సబ్జెక్టు ప్రోగ్రాం, మైనర్ సబ్జెక్టు ప్రోగ్రాం, ఉపాధి అవకాశాలపై సందేహ నివృత్తి చేయనున్నట్లు తెలిపారు.

డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : డిగ్రీలో సింగిల్ సబ్జెక్ట్ మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలని, త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభించి 20 రోజులు పూర్తవుతున్న నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అధ్యాపక, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు సునీల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



వార్డు సచివాలయ కన్వీనర్లు, సెక్రటరీలతో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 30వ డివిజన్‌లో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు. గురువారం స్థానిక వార్డు సచివాలయంలో సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఓ జాన్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప మండల విద్యాశాఖ అధికారి–2గా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఇర్షద్ అహమద్‌తో పాటు ప్రస్తుతం మండల విద్యాశాఖ అధికారి నారాయణను గురువారం కడప నగరశాఖ ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ–2గా బాధ్యతలు చేపట్టిన ఎస్ఎండీ ఇర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ సీనియర్ ఎంఈఓ–1 నారాయణ సహాయ సహకారంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్ బాష, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, జిల్లా మైనార్టీ కన్వీనర్ నజీబుల్లా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన బోధనను అందించాలని ఎంఈఓ–2 సునీత తెలిపారు. గురువారం ఆమె ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, మండల ప్రధాన కార్యదర్శి వీరనారాయణ, ప్రెసిడెంట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌మార్గ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జూలై 7,8 తేదీల్లో కడపలో సీఎం పర్యటన
- కలెక్టర్ విజయ్‌రామరాజు వెల్లడి
- ఆలోపు పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలు



రాజీవక్ మార్గ్‌ను పరిశీలించే క్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ విజయ్ రామరాజు తెలిపారు. గురువారం ఉదయం ఆయన రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 7, 8 తేదీల్లో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్నారని, 7వ తేది కడపలోని రాజీవ్ మార్గ్‌ను, రాజీవ్ పార్కులను ప్రారంభిస్తారని వెల్లడించారు. అప్పటిలోగా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు, డివైడర్ల పనులు పూర్తి చేసి మొక్కలు నాటాలన్నారు. ఇప్పటి వరకూ జరిగిన పనులు, ఇకపై చేయాల్సిన పనుల గురించి కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, నగరపాలక డీఈ వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రాజీవ్‌పార్కులో పచ్చదనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కడప నగరంలోని రాజీవ్‌మార్గ్ పనులను, రాజీవ్ పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మాణ పనులు రోడ్డు నుంచి షాపుల వరకూ ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ లైటింగ్‌ను వారంలోగా పూర్తి చేయాలని, రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. రాజీవ్ పార్కు ప్రహరీ అంతా విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. గార్డెన్‌లో పచ్చదనాన్ని ఒకే లెవెల్‌గా కట్ చేయాలన్నారు. హార్టికల్చర్ ఏడీ అనిల్ కుమార్, డీఈ వేణుగోపాల్, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 30న మహా ధర్నా

కడప వైఎస్సార్ సర్కిల్ : రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం ఆవరణలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సీమలోని వెనుకబడిన జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతులందరికీ గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపచేయాలని ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు చిన్న సిద్దయ్య శ్రీనివాసులు రెడ్డి సుబ్బారెడ్డి పుల్లారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నాగరాజుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈనెల 20వ తేది మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాగరాజుపేటలో పర్యటించిన కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌కు విద్యార్థుల నీటి సమస్యపై స్థానిక వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, ప్రధానోపాధ్యాయురాలు వివరించారు. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం, నీటి కొరత అధికమవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను తెలిపారు. వెంటనే స్పందించిన కమిషనర్ 21వ తేది బోరు వేయించి, 22వ తేది మోటారు, ఎలక్ట్రికల్ సామాగ్రి అమర్చారు. తద్వారా కేవలం 24 గంటల్లోనే విద్యార్థుల దాహార్తికి శాశ్వత పరిష్కారం చూపారు. ఇంత త్వరగా సమస్య పరిష్కారం కావడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్థానిక కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవిలకు కృతజ్ఞతలు తెలిపారు.



నాగరాజుపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో వేసిన బోరు నుంచి వస్తున్న తాగునీరు

30న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన

కడప వైఎస్సార్ సర్కిల్ : విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఈ విషయమై నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నున్న విద్యుత్ సబ్ స్టేషన్ బిల్లులు చెల్లింపు కేంద్రం వద్ద గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. వినియోగించిన విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్సడ్ కస్టమర్, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరిట పాలక ప్రభుత్వాలు అధిక వసూళ్లకు పాల్పడుతున్నాయని తెలిపారు. అఖిల పక్ష నాయకులు రామ్మోహన్, అలీఖాన్, అవ్వారు మల్లికార్జున, వెంకటశివ, కృష్ణమూర్తి, నాగ సుబ్బారెడ్డి, ఆంజనేయులు, పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న అఖిలపక్ష నాయకులు

రేపు కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

కడప వైఎస్సార్ సర్కిల్ : నగరంలోని ఇందిరాభవన్‌లో ఈ నెల 24న కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఏఐసీసీ మెంబరు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఏ సత్తార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు గాను ప్రతి జిల్లాలోని సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాలు జరుగుతూ ఉన్నాయి. అందులో భాగంగా 24న కడప జిల్లా సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు గారు, ఏఐసీసీ సెక్రటరీ మేయప్పన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు. బండి రత్నం పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

చెన్నూరు : బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని వారిని పనిలో పెట్టుకుంటే ఆయా సంస్థల యజమానులపై కేసులు నమోదు చేస్తామని కార్మికశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలను పనిలో పెట్టుకోకూడదని అలా చేయడం నేరమన్నారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జులై 1 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. అందులో భాగంగా గురువారం చెన్నూరులో పాత రోడ్డు మీద నుంచి కొత్త రోడ్డు మీదివరకు అన్ని షాపులను, హోటళ్లు, ఇటుకల బట్టీలు, ఐస్ ఫ్యాక్టరీలు వద్దకు వెళ్లి లేబర్ యాక్ట్ గురించి అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు చంద్రకళ, లీలారాణి, ఉమా తదితరులు పాల్గొన్నారు.



ఐస్ ఫ్యాక్టరీ యాజమానులకు అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి

ఖైదీలకు వైద్య పరీక్షలు

కడప అర్బన్: ఖైదీలందరికీ వైద్య పరీక్షలు చేయడంతో పాటు.. వారి దీర్ఘకాలిక వ్యాధులపట్ల అవగాహన కల్పించామని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.కే ఖాదర్‌వల్లీ అన్నారు. గురువారం కడప కేంద్రకారాగారం ఆవరణంలో వైద్య పరీక్షలలో భాగంగా రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కారాగారంలోని ఖైదీలందరికీ హెపటైటిస్–బి, సి, సిఫిలిస్, టి.బి. హెచ్.ఐ.వి తదితర వ్యాధులకు రక్త నమూనాలను సేకరించి, పరీక్షించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా కడప కేంద్రకారాగార సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు ఒకసారి ఖైదీల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయిస్తామన్నారు. కడప కేంద్రకారాగారం వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత,సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ ప్రవీణ్, సుదర్శన్ రెడ్డి ఖైదీలలో వున్న వ్యాధి నిర్ధారణలు కనుగొని, వారికి తగిన జాగ్రత్తలు తీసుకుని వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్, ఉప పర్యవేక్షణాధికారి జవహర్‌బాబు పాల్గొన్నారు.



ఖైదీల రక్తనమూనాలను పరిశీలిస్తున్న ఖాదర్‌వల్లీ, కేంద్రకారాగార సూపరింటెండెంట్ ప్రకాష్

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని రాచిన్నాయపల్లె నుంచి రామనపల్లి, ముండ్లపల్లి, ఓబులంపల్లికి వెళ్లే రహదారికి తారురోడ్డు వేసేందుకు శుక్రవారం జరిగే భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తున్న వారి ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచారని.. ఈ మేరకు జాప్యం జరిగిన కాలానికి అర్హతగల సెలవులు మంజూరు చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ రాఘవరెడ్డిని ఎస్టీయూ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, ఆదినారాయణరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, సునీల్‌కుమార్,సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి డీఈఓను కలిసిన వారిలో ఉన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను తొలగించడం సరికాదని.. వారినే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, నగర కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కడప డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడెనిమిదేళ్లుగా పనిచేస్తున్న తమను ఉన్న ఫలంగా తీసివేస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.చిన్నచౌక్ పోలీసులు ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్లారు.

రేపు వేలం

కడప కోటిరెడ్డిసర్కిల్: తహసీల్దార్ కార్యాలయంలోని పాత చెక్కలతో చేసిన ద్వార బందాలు, పలకలు, కిటికీ రెక్కలు, చెక్క దూళాలు తదితర సామాగ్రి వేలం పాట ద్వారా విక్రయించాలని నిర్ణయించామని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 24న ఉదయం 11 గంటలకు కార్యాలయంలో హాజరై రూ. 1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఏదైనా కారణం చేత వేలం నిలుపుదల చేసేందుకు తహసీల్దార్‌కు అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు. వేలం పాటకు ప్రారంభానికి 30 నిమిషాల ముందు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కడప డీఎస్పీ షరీఫ్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్‌లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి రౌడీ షీటర్ కేసు పొడిగిస్తామన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యబాబు పాల్గొన్నారు.

11 మంది అరెస్ట్

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19న కొండాయపల్లి సమీపంలో పెప్సీ గోడౌన్‌పై దాడి కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. షేక్ మహబూబ్ తాజుద్దీన్, సలీం, షేక్ ఖాజా, బాలరాజు, వీరవంశీ, రాజేష్, తాజ్‌బాబా, రియాజ్, మౌలాలి, షావల్లీ, పీరుల్లాలను అరెస్ట్ చేశారు. నిందితులలో ప్రధానంగా వెంకటేశ్వర్ నాయుడు, ఓ టి.వి ఛానెల్ కడప టౌన్ రిపోర్టర్ (సాక్షి కాదు), ఇంకా కొంతమంది ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

బెటాలియన్‌ను సందర్శించిన గ్రూప్ కమాండర్

కడప స్పోర్ట్స్ : కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపును తిరుపతి గ్రూప్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి గురువారం పరిశీలించారు. కడప 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌కు విచ్చేసిన ఆయనకు ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గార్డ్ ఆఫ్ హానర్ లభించింది. అనంతరం ఆయన ఎన్‌సీసీ అధికారులను పరిచయం చేసుకుని.. విద్యాలయాల్లో ఎన్‌సీసీని బలోపేతం చేయాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎన్‌సీసీ క్యాంపు నిర్వహణ గురించి కమాండింగ్ ఆఫీసర్‌తో చర్చించారు. అనంతరం ఆయన ఎన్‌సీసీ కేడెట్స్‌తో మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా క్యాంపు నిర్వహణ గురించి గ్రూప్ కమాండర్‌కు పూర్తిస్థాయిలో వివరించారు. అనంతరం ఎన్‌సీసీ శిక్షణకు సంబంధించి చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ అశోక్‌కుమార్, బిష్ణోయ్, ఎన్‌సీసీ అధికారులు మేజర్ సి. విజయభాస్కర్, డా. ఆర్. నీలయ్య, సూర్యనారాయణ, మహేష్, జయచంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరిస్తున్న తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి

హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేయండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి మాట్లాడుతూ హ్యాండ్ పోటీల్లో క్రీడాకారులు చక్కని ప్రతిభను కనబరుస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం యువకులు రాష్ట్ర స్థాయిలో ఆడించేందుకు మీవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేలా చూడాలని వినతిపత్రమిచ్చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామాగ్రిని మొదలుకొని వారు అన్ని స్థాయిల్లో రాణించేలా ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తున్నారు. క్రీడాకారులు పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. అలాగే క్రీడాకారులకు తగిన ప్రోత్సాహకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. చివరగా ఆర్టీసీ చైర్మన్‌ను క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సింధూరి, ట్రెజరర్ బాబర్, వైస్ ప్రెసిడెంట్లు సుధ హరనాథ్, జనార్దన్ రెడ్డి, వెంకట సునీల్, జాయింట్ సెక్రటరీలు స్వాతి రెడ్డి, రోజా మెర్సీ, సాయికిశోర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు వినయ్, చరణ్, లావణ్య, సంధ్యారాణి, మన్సూర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న హ్యాండ్ బాల్ అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు

సీడీపీఓ సునందను సస్పెండ్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను వేధిస్తున్న కడప సీడీపీఓ సునందను సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం సీఐటీయూ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 2017, 2018లో ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రయోజనాలు కల్పించాలని స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. దీనిపై కక్ష పెంచుకున్న సునంద కార్యకర్తలు, ఆయాలను వేధిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 8.40 గంటలకే కేంద్రం వద్ద ఉండాలని, 9.00 గంటలకే పిల్లలు ఉండాలంటూ తనిఖీలు నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అర్హులకు పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. టీఏ, డీఏ, గ్యాస్ బిల్లులు, సెంటర్ల అద్దెలు, జీతాలు ఇవ్వకుండా పనులు మాత్రం చేయిస్తున్నారని తెలిపారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, నాయకులు అంజలిదేవి, మెర్సీ, దీప తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు

సైన్స్ అవార్డుల రద్దు దేశ ప్రగతికి అడ్డు

కడప కల్చరల్ : సైన్స్ అవార్డులను రద్దు చేయడం దేశ ప్రగతిని అడ్డుకోవడమేనని, శాస్త్ర పురోగతిని భంగ పరిచినట్లని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి తీసుకున్న నిర్ణయం సరికాదని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ హోదా గల శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు ఇవ్వడమేనని, ఇలా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. వాటిని రద్దు చేయడం ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకుని తాను చెప్పినట్లు వినే కీలు బొమ్మలను చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అని విమర్శించారు. సంస్థ జిల్లా అధ్యక్షులు బాల బయన్న మాట్లాడుతూ పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం, విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపరచకూడదనే భావన పాలకుల్లో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

బెస్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

కడప అగ్రికల్చర్: బెస్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ రాంప్రసాద్ కోరారు. ఈ విషయమై గురువారం కడపలోని మత్స్యశాఖ కార్యాలయం వద్ద వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మత్స్య సహకార సంఘాల అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం అన్ని చెరువులకు, రిజర్వాయర్లకు ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేసేదన్నారు. దీంతోపాటు సభ్యులకు సంబంధించి ఐస్‌బాక్సులు, సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు వంటి వాటిని 75 శాతం సబ్సిడీలో అందించే వారన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం మత్స్యశాఖ డీడీకి వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో బెస్తసంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, వెంకటేసు, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌యూ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంతవరకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. దీంతో పాటు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉర్దూ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరి, రమేష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి

వీరపునాయునిపల్లె : అర్హులై ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందలేదన్న మాట ప్రజలనుంచి వినిపించకూడదని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె ఎస్సీ కాలనీ, లింగాల గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఇంకెవరికైనా పథకాలు అందకుండా ఉంటే తెలియజేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నాడని ప్రజలకు చూసించారు. స్థానికంగా గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలు వారి సమస్యలను గ్రామంలో పరిష్కరించు కొనేందుకు వీలు కల్పించారన్నారు. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేదని ప్రస్తుతం అటువంటి వాటికి స్వస్తి చెప్పి గ్రామ స్థాయిలోనే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య, మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, వెలుగు ఏపీఎం భాగ్యమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, పీఆర్ ఏఈ మల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, గంగిరెడ్డిపల్లె మాజీ ఎంపీటీసీ రవి, స్థానిక నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యను వింటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి